సాక్షి
విజయనగరం

శుక్రవారం ¦ 26 ¦ మే ¦ 2023



మామిడితో ఆదాయం మెండు..!

అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. మామిడి మొక్కలు నాటేందుకు ఇదే మంచి అదునని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు.

- 8లో



పాడి రైతుకు భరోసా

పాడినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం 'వైఎస్సార్ పశుబీమా పథకాన్ని' అమల్లోకి తెచ్చింది.

- 8లో

బొబ్బిలిలో పిడుగుల వాన

బొబ్బిలి పట్టణం, పరిసర ప్రాంతాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో కూడని భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండలు మండడంతో జనం విలవిల్లాడారు. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా మేఘాలు ఆవరించి భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎండ నుంచి ఉపశమనం లభించింది. గొల్లపల్లిలోని పైల వీధిలో తెర్లి దాడియ్యకు చెందిన పశువుల పాకపై పిడుగుపడడంతో దగ్ధమైంది. - బొబ్బిలి

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ సహాయ కలెక్టర్



కలెక్టర్ నాగలక్ష్మితో మాట్లాడుతున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం ఫోర్ట్: శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. పరిపాలనా పరమైన అంశాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును అధ్యయనం చేశారు. 2022 సివిల్ సర్వీసెస్‌కు బ్యాచ్‌కు చెందిన వెంకటత్రివినాగ్ హైదరాబాద్ ఐఐటీ మెటలర్జీ బ్రాంచిలో 2020లో బీటెక్ పూర్తి చేశారు. విజయవాడ, విశాఖపట్నం, ముంబై తదితర నగరాల్లో పాఠశాల విద్యను పూర్తిచేసి సీబీఎస్‌ఈ అఖిల భారత పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచారు. త్రివినాగ్ తండ్రి బి.అజయ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. అజయకుమార్ స్వస్థలం విశాఖపట్నం. శ్రీకాకుళంలో నిర్వహించిన చదరంగం టోర్నమెంట్‌లో గతంలో పాల్గొన్నట్టు ట్రైనీ కలెక్టర్ వివరించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఆహ్వానం



హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానిస్తున్న గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్టును సందర్శించాలని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎ.వి.శేషసాయిని ట్రస్టుచైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు గురువారం ఆహ్వానించారు. తన బృంద సభ్యులతో అమరావతిలోని హైకోర్టు ప్రాంగణంలో చీఫ్ జస్టిస్‌ను కలిశారు. ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేస్తున్న సేవ, కృత్రిమ అవయవాల తయారీ, ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలను వివరించారు. ఆగస్టు నెలలో ట్రస్టును సందర్శిస్తానని శేషసాయి తెలిపినట్టు జగదీష్‌బాబు స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు.

వచ్చేనెల 2న జీసీసీ టెండర్లు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమపాఠశాలలు, గురుకులాలకు కిరాణా సరుకులు సరఫరా చేసేందుకు ఈ నెల 2వ తేదీన టెండర్లు నిర్వహిస్తామని జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 1వ తేదీ వరకు టెండర్లు స్వీకరిస్తామన్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు

- స్కిల్ కళాశాలగా మారనున్న వైటీసీ

సీతంపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా హై క్వాలిఫికేషన్ ఉన్న నిరుద్యోగులకు స్కిల్ కళాశాల ద్వారా శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం సీతంపేటలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ) ఇక నైపుణ్య కళాశాలగా మారనుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి గురువారం అనుమతులు వచ్చాయి. డిగ్రీ, బీటెక్ ఇంజినీరింగ్ ఆపై చదువులు పూర్తి చేసిన నిరుద్యోగులకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉన్న ఐటీ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోనున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 120 మందికి ట్రైనింగ్ ఇవ్వనున్నారు.

గొడుగు నీడలో బతుకు ప్రయాణం



ఎండైనావానైనా.. బతుకు బండి నడిపితేనే కష్టజీవులకు నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లేది. కుటుంబ నావ చక్కగా సాగేది. దీనికి రాజాం-పాలకొండ రోడ్డులో గురువారం కనిపించిన ఈ చిత్రమే సజీవ సాక్ష్యం. భానుడు భగభగ మండేవేళ... రాజాం పట్టణానికి చెందిన రాము అనే ట్రాలీ కార్మికుడు గొడుగునీడలో బతుకుబండితో ముందుకు సాగుతూ.. శ్రమైక జీవన సౌందర్యాన్ని చాటిచెప్పాడు.

- రాజాం సిటీ

రూ.కోటి నిధులతో...

రాములోరి ఆలయ అభివృద్ధి

- రామతీర్థంలో అభివృద్ధి పనులు ప్రారంభం
- శాశ్వత యాగశాల నిర్మాణానికి శ్రీకారం
- ఆలయంలో శర వేగంగా ఫ్లోరింగ్ తవ్వకాలు
- ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు

నెల్లిమర్ల రూరల్:

భక్తులకు శుభవార్త. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానం అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎంతో ఘనకీర్తి కలిగిన దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే రామతీర్థం బోడికొండపై ఏళ్ల కాలం నుంచి శిథిలావస్థలో ఉన్న కోదండ రామాలయాన్ని రూ.3 కోట్ల నిధులతో సర్వాంగ సుందరంగా నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. తాజాగా దిగువనున్న ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడంతో దేవాలయ అభివృద్ధి కుంటుపడింది. సాక్షాత్తు కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక గజపతిరాజు ఆలయానికి ధర్మకర్తగా వ్యవహరిస్తున్నప్పటికీ రామక్షేత్ర అభివృద్ధిని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భక్తుల మనోభావాలకు అనుగుణంగా, ఆగమ, వాస్తు శాస్త్రప్రకారం ఆలయాన్ని అభివృద్ధి చేస్తుండడంపై భక్తలోకం హర్షం వ్యక్తంచేస్తోంది.



రామతీర్థం దేవాలయం

నిధుల కేటాయింపు ఇలా...

మొత్తం మంజూరైన నిధులు	:	రూ.1,00,00,000
గ్రానైట్ స్టోన్‌తో ఫ్లోరింగ్ నిర్మాణానికి	:	రూ.58,23,038
శాశ్వత యాగశాల నిర్మాణానికి	:	రూ.11,25,663
రిటైనింగ్ వాల్ నిర్మాణం, అభివృద్ధికి	:	రూ.14,47,609
మండపం కూల్చివేత ఖర్చు	:	1,00,000
ఇతర ఖర్చులు	:	15,03,690



పాత ఫ్లోరింగ్ తొలగింపు పనులు ...

పనులు ప్రారంభమయ్యాయి



రామతీర్థం దేవాలయంలో రూ.కోటి సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పాత ఫ్లోరింగ్ తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు చెప్పాం. ముందుగా ఆలయం మొత్తం ఫ్లోరింగ్ పూర్తయ్యాక శాశ్వత యాగశాల, ఉత్తర రాజగోపురం వద్ద ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– కిశోర్‌కుమార్, ఈఓ, రామతీర్థం దేవస్థానం

రూ.కోటితో పనులు ప్రారంభం

రామతీర్థం దేవాలయంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.కోటి సీజీఎఫ్ నిధుల మంజూరు చేసింది. అభివృద్ధి పనులకు టెండర్లు కూడా పూర్తి కావడంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆలయంలో శిథిలావస్థకు చేరిన పాతఫ్లోరింగ్‌ను కార్మికులు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మరికొద్ది రోజుల్లోనే ఫ్లోరింగ్ నిర్మాణంతో పాటు శాశ్వత యాగశాల నిర్మాణం, ఉత్తరరాజగోపురం వద్ద బ్యూటీఫికేషన్ పనులు పూర్తి చేయనున్నారు.



ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు (ఫైల్)

యాగశాల నిర్మాణంతో తొలగనున్న ఇబ్బందులు



శాశ్వత యాగశాల నిర్మాణం చేయనున్న ప్రదేశం

రామతీర్థంలో యాగశాలలో ఏడాది పొడవునా నిత్యం హోమాలు జరుగుతుంటాయి. అంతే కాకుండా ప్రత్యేక రోజుల్లో మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు జరిపిస్తుంటారు. ఎప్పటి నుంచో రామతీర్థంలో తాటికమ్మలతో కూడిన యాగశాలలోనే కార్యక్రమాలు కొనసాగుతూ వస్తున్నాయి. ముఖ్యంగా శివరాత్రి సమయాల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మత్స్యకారులు వారి సంప్రదాయబద్ధ పూజల్లో భాగంగా కాగడాలు వెలిగిస్తూ ఆలయం వెలుపలకి రావడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆలయ అధికారులు ప్రతి ఏటా తాటి కమ్మలను తీయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మళ్లీ ఉత్సవాలు ముగిసిన వెంటనే కొత్త తాటాకుల కమ్మలతో యాగశాలను నిర్మిస్తున్నారు. అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు శాశ్వత యాగశాల నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో ఇబ్బందులు తొలుగుతాయని భక్తులు, అర్చకులు చెబుతున్నారు.

పరిమళించిన మానవత్వం

- తండ్రి మృతివార్త తెలియజేసినా పట్టించుకోని కుమారులు!
- దహనసంస్కారాలకు ముందుకొచ్చిన యూత్‌సభ్యులు



గోపాల్ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహిస్తున్న న్యూ విజయనగరం యూత్ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: మానవత్వం పరిమళించింది. ఓ వ్యక్తి మృతదేహానికి న్యూ విజయనగరం యూత్ సభ్యులు గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారు. వివరాల్లోకి వెళ్తే... కడప జిల్లా మంగపట్నం కమ్మవారిపల్లెకు చెందిన గోపాల్ నాయుడు అనే వ్యక్తి ఇటుక బట్టీల్లో మట్టిపనులు చేసేందుకు భార్య వెంకటలక్ష్మితో కలిసి ఏడాది కిందట పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వచ్చాడు. రెండు రోజుల కిందట అనారోగ్యానికి గురికావడంతో వైద్యసేవల కోసం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేక గోపాల్‌నాయుడు భార్య బాధపడుతున్న విషయం తెలుసుకున్న న్యూ విజయనగరం యూత్ సభ్యులు శివ, అనిల్‌కుమార్‌లు రింగ్ రోడ్డులో ఉన్న వైకుంఠధామంలో మృతదేహానికి అంత్య క్రియలు పూర్తిచేశారు. ఆ సమయంలో మృతుడి భార్య కన్నీటి పర్యంతమైంది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారని, అందులో ఒకరు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్టు సమాచారం. తండ్రి మృతి చెందాడన్న విషయాన్ని అంబులెన్స్ డ్రైవర్ తెలియజేసినా పట్టించుకోలేదని, అక్కడే దహన సంస్కారాలు పూర్తిచేయాలని, డెత్ సర్టిఫికెట్ పంపిస్తే చాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు తెలిసింది.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఫస్టియర్ ఇంగ్లిష్-1 పరీక్షకు సంబంధించి 9,580 మందికి 416 మంది గైర్హాజరుకాగా, 9,164 మంది హాజరైనట్టు ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన సెకిండియర్ ఇంగ్లిష్-2 పరీక్షకు 3,190 మందికి 190 మంది గైర్హాజరయ్యారు. 3000 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. పెరుమాలి మోడల్ స్కూల్‌లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థిని డీబార్ చేసినట్టు తెలిపారు.

ఫ్యామిలీడాక్టర్ శిబిరంలో 14 రకాల వైద్య పరీక్షలు

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఇప్పటి వరకు 2.22 లక్షల మందికి వైద్య సేవలు
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఊరు/వార్డుల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. నిపుణులైన వైద్యులు అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజు ఒక సచివాలయం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. హెచ్‌బీ, బీపీ, సుగర్, మలేరియా, హెచ్ఐవీ వంటి పరీక్షలు చేస్తారని చెప్పారు. ఉదయం నిర్వహించే ఓపీలో గర్భిణులకు వైద్య తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం బాలింతలు, శస్త్రచికిత్సలు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్యులు సేవలు అందిస్తారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. 2022, అక్టోబర్ 21వ తేదీన ప్రారంభమైన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇప్పటివరకు 2,22,995 మందికి వైద్య సేవలు అందించినట్టు వెల్లడించారు. వీరిలో జనరల్ ఓపీ 1.40 లక్షల మంది రోగులు ఉన్నారని చెప్పారు. అలాగే, నోటికేన్సర్ లక్షణాలు ఉన్న వారు 409 మంది, రొమ్ము కేన్సర్ లక్షణాలు ఉన్న వారు 262 మందిని గుర్తించారన్నారు. జిల్లాలో 54 పీహెచ్‌సీలు ఉన్నాయని, వీటిలో 108 మంది వైద్యులు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లు 15, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు 81 ఉన్నాయని చెప్పారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వద్ద లింగ నిర్ధారణ వెల్లడి చట్ట రీత్యానేరం, స్కానింగ్ చేయడానికి తీసుకునే ఫీజు వివరాలు తెలిపే బోర్డు పెట్టాలని ఆదేశించామన్నారు. లేదంటే ఆయా స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని 16 మోడల్ స్కూల్స్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఆంగ్ల మాధ్యమంలో ఉచితవిద్య అందజేస్తామన్నారు. ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు వివరాల కోసం httpr:ampr.apcfrr.in httpr://cre.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అభ్యర్థులు ఈనెల 22 నుంచి జూన్ 6 లోగా నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డులను ఉపయోగించి అప్లికేషన్ రుసుము చెల్లించాలన్నారు. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌వారికి రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.150 చెల్లించాలని పేర్కొన్నారు. 10వ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, లేక సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గంగన్నపాడులో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

తెర్లాం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపాడులో రూ.39 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను గురువారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ కోట సరస్వతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా గంగన్నపాడు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు సుమారు రూ.9 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. అలాగే గ్రామంలో సుమారు రూ.79 లక్షలతో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించి ప్రారంభించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని చెప్పారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగనన్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సొంత గ్రామాల్లోనే అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు ఆర్‌బీకేలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా జిల్లాలోని అనేక ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పాలనను చూసి ఓర్వలేకే చంద్రబాబునాయుడు, లోకేష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మరని చెప్పారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ రాజేశ్వరరావు, పీఆర్ డీఈ అప్పారావు, ఏఈ ఆర్నిపల్లి రాజశేఖర్, ఏఓ సునీల్‌కుమార్, డాక్టర్ దీక్షితారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గర్భాపు రామారావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈజీగా రిజిస్ట్రేషన్

- స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ల కోసం ఇ-స్టాంపింగ్ సేవలు
- స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం
- జిల్లా వ్యాప్తంగా ఇ-స్టాంపింగ్ కలెక్షన్‌కు 29 కేంద్రాలకు అనుమతి
- గ్రామ సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు
- కక్షిదారులు స్వయంగా దస్తావేజులు తయారీకి వెబ్‌సైట్‌లో మార్పులు



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

విజయనగరం రూరల్:

ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేసేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో ఇ-స్టాంపింగ్ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఇ-స్టాంపింగ్ సేవలు అందించేందుకు 29 కేంద్రాలకు అనుమతినిచ్చింది. దీనిలో భాగంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌హెచ్‌సీఐఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కొత్త వ్యవస్థతో ప్రజలకు సులభతరంగా రిజిస్ట్రేషన్ సేవలు అందనున్నాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వినియోగం తగ్గుతుంది. జిల్లాలో ఇకపై అన్ని లావాదేవీలు ఇ-స్టాంపింగ్ విధానంలోనే సాగనున్నాయి. స్టాంప్ డ్యూటీ,రిజిస్ట్రేషన్ ఫీజులు నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుపుకునేందుకు వీలుకలుగుతుంది. ఇ-స్టాంపింగ్ విక్రయ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సత్వరమే లైసెన్సులు మంజూరుచేస్తోంది. దీనివల్ల స్టాంపుల కృత్రిమ కొరతను నివారించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుంది. ఇ-స్టాంపింగ్ లావాదేవీల కు బొబ్బిలి, గజపతినగరం, రాజాంలో మూడేసి కేంద్రాలకు అనుమతినివ్వగా, ఎస్.కోట, నెల్లిమర్ల, కొత్తవలస, విజయనగరం పశ్చిమ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రెండేసి కేంద్రాలకు, భోగాపురం, చీపురుపల్లిలో ఒక్కో కేంద్రం ఏర్పాటుకు అనుమతి లభించింది. విజయనగరం ఆర్వో సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 10 కేంద్రాలకు అనుమతి లభించింది.

ఆన్‌లైన్ దస్తావేజు ప్రక్రియలో మార్పులు

భూక్రయ, విక్రయదారులు దళారులు, దస్తావేజులేఖర్ల బారినపడకుండా నేరుగా వారి దస్తావేజులు వారే తయారు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం 2020లో నమూనా దస్తావేజులను ఆన్‌లైన్‌లో పొందిపరిచే విధానానికి (పబ్లిక్ డేటా ఎంట్రీ) శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియలో ప్రజలు వారి స్థిరాస్తుల కొనుగోలుకు సంబంధించి దస్తావేజులను ఆన్‌లైన్‌లో తయారు చేసుకుని, రిజిస్ట్రేషన్ సమయం, తేదీలను ఖరారు చేసుకుని, ఆ సమయానికి నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే, దీనికి మరింత మెరుగులుదిద్దుతూ దస్తావేజు తయారీ, జనరేట్‌తో పాటు స్టాంప్ డ్యూటీ, రుసుములు ఆన్‌లైన్‌లో చెల్లించేవిధంగా తీర్చిదిద్దేందుకు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. కొనుగోలుకు సంబంధించిన స్థలం నిషేధిత జాబితాలో ఉందా, లేదా అని తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. చిట్‌ఫండ్, నోటరీ, రెన్యువల్స్‌కు సంబంధించిన ప్రక్రియ కాగితాల రూపంలో కాకుండా ఆన్‌లైన్‌లో అందించే ఏర్పాట్లు చేస్తోంది.

సేవలు సులభతరం



ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఇ-స్టాంపింగ్ విధానంతో ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందుతాయి. జిల్లాలోని 118 గ్రామ సచివాలయాల్లో స్థిరాస్తులకు, వివాహ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ప్రక్రియ పూర్తయింది. ఇప్పటికే దిబ్బగుడివలస, పెదమానాపురం, రంగారాయపురం గ్రామ సచివాలయాల్లో 5 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.సృజన, జిల్లా రిజిస్ట్రార్

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు వారి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. దీంతో పాటు స్థిరాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ సేవలను గ్రామ సచివాలయాల్లోనే అందిస్తుంది. వివాహ రిజిస్ట్రేషన్లు సచివాలయాల్లో చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ప్రక్రియ సచివాలయాల్లోనే కొనసాగనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. తొలి విడతలో ప్రయోగాత్మకంగా దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం, రామభద్రపురం మండలంలోని సోంపురం గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించగా, రెండో విడతలో మరో 116 సచివాలయాల్లో వీటి ప్రక్రియను ప్రారంభించారు. దీనికి సంబంధించి డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయ తీ కార్యదర్శులకు 236 మందికి రిజిస్ట్రేషన్ల లావాదేవీలపై శిక్షణ ఇచ్చారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నారు. మూడో విడతలో మరో 202 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం పూర్తయింది.



దిబ్బగుడివలస గ్రామ సచివాలయం

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

కొత్తవలస: ప్రేమ పేరుతో వేధించడంతో మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేధింపులకు పాల్పడిన అదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి గాటీలు (19)పై ఎస్సై బొడ్డు దేవి కేసు నమోదు చేసి అరెస్టు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

గొట్లాంలో నగలు, నగదు చోరీ


దొంగతనం జరిగిన ఇంటి ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గురువారం వేకువ జామున దొంగలు హడావుడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లోళ్ల నర్సింహమూర్తి ఇంట్లో వేకువ జామున గుర్తు తెలియని వ్యక్తి చొరబడి ఆయన భార్య మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడుతో పాటు ఇంట్లోని బీరువాలో గల రూ.2500 నగదు అపహరించుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇంటి పరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల వారిని విచారణ చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. అలాగే గ్రామంలో గల షాలోమే ఆస్పత్రి యజమాని ఇంట్లో కూడా దొంగతనానికి ప్రయత్నించగా ఇంట్లో వారు అప్రమత్తం కావడంతో దొంగ ఉడాయించారు. గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడుతో పాటు సీసీఎస్ సర్కిల్ సీఐ, క్లూస్ టీమ్ సిబ్బంది ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్‌అండ్‌బీ జంక్షన్ సమీపంలో అక్రమంగా గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఐదుకిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.
గోకపేటకు చెందిన బొంతు వెంకటేశ్వరరావు గంజాయి తరలిస్తున్నట్లు తెలిసిన సమాచారం మేరకు ఆర్‌అండ్‌బీ జంక్షన్ దగ్గర తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సైలు భాస్కరరావు, రామగణేష్, సిబ్బంది గంజాయి తరలిస్తున్న వెంకటేశ్వరరావును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా భానుమూర్తి


రాష్ట్ర మహాసభల్లో భానుమూర్తిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా పెంట భానుమూర్తి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని నిడమానూరు మురళి రిసార్ట్స్'లో బుధవారం నిర్వహించిన యూనియన్ రాష్ట్ర మహాసభల్లో తనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తెలిపారు. 30 ఏళ్ల డిపో కార్యదర్శిగా, జోనల్ కార్యదర్శిగా పనిచేశానని, రాబోయే రోజుల్లో మరింతగా సేవలందించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

మామిడితో ఆదాయం మెండు..!

- కొత్తగా తోటలు వేయడానికి అదును ఇదే
- మెలకువలు పాటిస్తే సిరుల పంట
- వరుసగా మూడేళ్లు ప్రభుత్వ సాయం


నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మామిడి మొక్కలు

పాలకొండ రూరల్: ప్రస్తుతం మామిడి తోటలు వేసేందుకు అనుకూల పరిస్థితులు ఉంటాయని ఉద్యానవన శాఖాధికారులు పేర్కొన్నారు. జిల్లాలో అధిక శాతం రైతులు ప్రత్యామ్నాయ, వాణిజ్యపంటలపై మక్కువ చూపుతుండడం మంచి పరిణామం. దాదాపు 5వేల హైచిలుకు హెక్టార్లలో మామిడి సేద్యం జిల్లా పరిధిలో జరుగుతోంది. ఈ క్రమంలో నూతనంగా తోటలు వేయదలచిన రైతులు రానున్న జూన్ నెలలో వచ్చే తొలకరి వర్షాలకు ముందుగానే సిద్ధం కావాలని సూచిస్తున్నారు. మామిడి తోటల సాగుపై ఉద్యానవనశాఖాధికారులు తెలియజేస్తున్న జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

భూసార పరీక్షలు..

మామిడితోటలను నాటే రైతులు సంబంధిత భూమిలో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. నేల లక్షణాలకు అనుగుణంగా రెండు లేదా మూడు ప్రాంతాల్లో ఆరడుగుల లోతువరకు గోతులు తవ్వి ఒక్కో అడుగుకు గుప్పెడు మట్టి నమూనా తీసి విడివిడిగా పొట్లాలు కట్టి పరీక్షలకు పంపాలి. తోటలు పెంచదలిచిన నేలను వేసవిలో లోతుగా దుక్కిచేసి ఎండనివ్వాలి. పొడవు, వెడల్పు, లోతు మీటరు వైశాల్యం ఉండేలా గుంతలను వేసవిలోనే తవ్వించి బాగా ఆరనివ్వాలి. సారవంతమైన భూముల్లో మొక్కలు బాగా పెరుగుతాయి కనుక గుంతల మధ్య దూరం తేలిక భూములకన్నా ఎక్కువగా ఉండేలా చూడాలి. సాధారణ తోటల్లో మొక్కకు మొక్కకు మధ్య 8 మీటర్ల దూరం ఉంచితే అంతర పంటల సేద్యానికి అనుకూలంగా ఉంటుంది. మామిడి మొక్కల్లో పెరుగుదల తక్కువ. హైబ్రీడ్ రకాలు వేసేటప్పుడు అధిక సాంద్రతలో 5.5 మీటర్లు ఎడం ఉండేలా ఎకరాకు 160 మొక్కలు నాటుకోవడం మంచిది.

వాతావరణం..

పూత సమయంలో శీతోష్ణం, గాలిలో తగినంత తేమ ఉండే వాతావరణం శ్రేయస్కరం. వర్షపాతం ఏటా ఆరు వందల మిల్లీమీటర్లు తగ్గకుండా ఉండే విధమైన భూములను ఎంచుకోవాలి. నీరు నిలవని గరప నేలలు, చౌడు లేని భూములు ఈ తోటలకు అనుకూలంగా ఉంటాయి. బంక నేలలు, సుద్ద పొరలు, నూనె మెరుగులు, సున్నపు రాళ్లు అధికంగా ఉన్న నేలలు మామిడితోటల పెంపకానికి ప్రతికూలంగా ఉంటాయి. ఉదజని సూచిక 6 నుంచి 7.5 వరకు ఉన్న నేలలు అనువైనవి.

అంటుమొక్కల సేకరణ..

పండ్లతోటలు నాటే వారికి నాణ్యమైన మొక్కల లభ్యత ప్రధాన సమస్యగా మారే పరిస్థితి ఉంది. ఎంపిక చేసుకున్న మొక్కలను బట్టే తోటల పెరుగుదల ఉంటుంది. మొక్కలు అమ్మే నర్సరీల వద్ద తమ భూమి స్థితిగతులను వివరించి అందుకు తగ్గట్లుగా పెరుగుదల ఉండే మొక్కలపై రైతులు దృష్టి సారించాలి. ఎంచుకున్న మొక్కల్లో భౌతిక లక్షణాలు, జన్యుపరమైన సమస్యలను ముందుగానే పరీక్షించుకోవడం మేలు. నర్సరీల్లో తల్లిచెట్టు ఉండదు. అంటు కట్టిన మొక్కలను అమ్మకానికి ఉంచుతారు. దీనిపై కూడా అవగాహన పెంచుకోవాలి.

సొంతంగా అంటుకడితే మేలు..

తొలకరిలో పండ్లతోటలను నాటదలచిన రైతులు దగ్గర్లో ఉన్న నర్సరీకి వెళ్లి తాము ఎంచుకున్న మొక్కలకు సొంతంగా అంటుకట్టించడం శ్రేయస్కరం. వేరు మూలం, మొక్కలను పరిశీలించి, తల్లిచెట్టును గమనించిన రైతులు ఆ తరువాత దానినుంచి రెమ్మలను సేకరించి నర్సరీల్లో అంటుకట్టే ఏర్పాటు చేయించాలి. ఆ మొక్కలపై గుర్తులను ఏర్పాటు చేసుకుని అవే మొక్కలను తోటల్లో వేయడం మంచిది.

టెంక ద్వారా కూడా..

రైతులు టెంకలను సేకరించుకుని స్వయంగా నారు పోసుకుని మొక్కలను పెంచుకోవడం మరోపద్ధతి. సమీపంలో విరగ్గాస్తున్న మొక్కలను గుర్తించి వాటి టెంకలను సేకరించడం లేదా చెట్ల నుంచి కాడలను, మొగ్గ అంట్లను తెచ్చుకోవాలి. రైతులే స్వయంగా అంటుకట్టి ఆ మొక్కలను వేయడం లాభదాయకం. మామిడి తోటలపై మక్కువ ఉన్న రైతులు ప్రణాళికాబద్ధంగా భూములను తయారు చేసుకోవడంతో పాటు ముందస్తుగా మొక్కలను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే వనసంరక్షణ, ఉద్యానవన శాఖల ద్వారా మరిన్ని మెలకువలు తెలుసుకుని తోటలు వేసుకుంటే సకాలంలో పంట చేతికి వచ్చి లాభాల బాట పట్టవచ్చు.

ప్రభుత్వ సహకారం

ఉద్యానవన శాఖ పరిధిలో మామిడి, జీడి రైతులకు ప్రభుత్వ సహకారం ఉంటుంది. ఆసక్తిగల రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తాం. ఈ తోటల పెంపకానికి తొలిదశలో రూ.35వేలకు పైబడి మదుపు అవుతుంది. మొదటి సంవత్సరం రూ.7,980, రెండు, మూడవ సంవత్సరాలు రూ.2,660 చొప్పున మామిడి రైతుకు రాయితీ వస్తుంది. జీడి తోటలు వేయదచిన రైతులకు హెక్టారుకు దాదాపు 200 మొక్కలు అవసరం ఉటుంది. రూ.50వేల వరకు ఖర్చు అవుతుంది. రాయితీ మొదటి సంవత్సరం రూ.12వేలు, రెండు, మూడు సంవత్సరాలకు రూ.4వేలు వంతున రాయితీ రూపంలో ప్రభుత్వం ద్వారా పొందవచ్చు. ప్రస్తుతం సీతంపేట, బొబ్బిలి నర్సరీల్లో మొక్కలు సిద్ధంచేయిస్తున్నాం.


తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారిణి, పాలకొండ

చెట్టు కొమ్మలు పడి మహిళకు గాయాలు


రైల్వేస్టేషన్‌లో గాయపడిన మహిళను కారు ఎక్కించిన స్థానికులు

దత్తిరాజేరు: భారీ ఈదురుగాలుల కారణంగా మండలంలోని కోమటిపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం రైలు దిగి నడుచుకుంటూ వస్తున్న మహిళపై చెట్టుకొమ్మలు విరిగిపడడంతో తలకు తీవ్రమైన గాయమైంది. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు తన కారులో బాధితురాలిని దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రాథమిక వైద్యం చేసి 108లో గజపతినగరం పంపించారు. టి.బూర్జవలసలో వారి బంధువు అనారోగ్యంతో మృతిచెందడంతో పరామర్శించడానికి పార్వతీపురం నుంచి ఇనుముల పార్వతి వస్తుండగా రైల్వేస్టేషన్‌లో గాయపడింది. గాయపడిన మహిళను ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు పరామర్శించారు.

పిడుగుపడి మహిళ మృతి


మృతిచెందిన పార్వతి


పొలంలో మృతిచెందిన పాడిగేదె

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురం గ్రామానికి చెందిన గంట పార్వతి(48) పిడుగు పడి గురువారం సాయంత్రం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పొలం పనులకు వెళ్లిన ఆమె తిరిగి వస్తుండగా పిడుగుపడంతో స్పృహతప్పి పడిపోయింది. ఈమేరకు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. మృతురాలికి భర్త సింహాచలం, కొడుకు, కుమార్తె ఉన్నారు.

మరో సంఘటనలో గేదె..

మెంటాడ: మండలంలోని జయితి గ్రామంలో ఈదురుగాలులు వీయడంతో పిడుగుపడి గ్రామానికి చెందిన పొట్టంగి అప్పలనాయుడి పాడి గేదె మృతి చెందింది. పొలాల్లో మేతకోసం గేదెను విడిచిపెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అప్పలనాయుడు కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. అలాగే గ్రామంలోని ప్రధానవీధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ కూడా నేలకొరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. గాలుల తాకిడికి అక్కడక్కడ చెట్లు కూలిపోయాయన్నారు.

జైళ్లశాఖలో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలి

విజయనగరం క్రైమ్: జైళ్ల శాఖలో పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న అధికారులు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని సబ్ జైల్ జిల్లా అధికారి మధుబాబు, జైలర్ శివప్రసాద్‌లు ఆకాంక్షించారు. విజయనగరం సబ్‌జైలర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై విశాఖ సెంట్రల్ జైల్‌కు వెళ్తున్న టి.దుర్గారావు, పార్వతీపురం మన్యం జిల్లా సబ్ జైలర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై చిత్తూరు వెళ్తున్న అప్పలనారాయణలకు స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో అధికారులు గురువారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. పూలు, పండ్లు, దుశ్శాలువలు, జ్ఞాపికలతో ఇద్దరినీ ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా పనిచేయగలిగే సామర్థ్యం ఉన్న వ్యక్తులుగా మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని , అందరి అభిమానం చూరగొన్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొబ్బిలి, చీపురుపల్లి సూపరింటెండెంట్‌లు పాత్రో, కృష్ణమూర్తి, సబ్‌జైల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనీ కెమిస్టులకు ఆహ్వానం

- పార్వతీపురంలో 31న ఇంటర్వ్యూలు


జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్

పార్వతీపురం: ఇంటర్మీడియట్ (ఎంపీసీ/బైపీసీ గ్రూపులు) 2022-23లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ట్రైనీ కెమిస్టులుగా అవకాశం కల్పించేందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ ఆహ్వానిస్తోంది. మొత్తం 40 ఖాళీలకు గాను ఈ నెల 31వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనీ కెమిస్టులుగా ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి 1.6 లక్షల వేతనం అందజేయడంతో పాటు ఉన్నత చదువును (డిగ్రీ) రెడ్డీస్ ల్యాబ్ చదివిస్తుందని పేర్కొన్నారు. అలాగే సబ్సిడీపై వసతి, భోజన సదుపాయం కల్పించనుందని తెలిపారు. 18 నుంచి 23 సంవత్సరాల(15జూన్ 2003 నుంచి 15 జూన్ 2005 మధ్య జన్మించిన వారు) వయస్సు గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూకు అర్హులని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరు కాదలచిన అభ్యర్థులు వారి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్, పాస్‌పోర్ట్ ఫొటో, దరఖాస్తు(రెజ్యూమ్)తో పాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9182398235 (పి.జగ్గునాయుడు, 7997299730 (మనోజ్ కుమార్)లను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ ఎంసెట్‌లో 20వ ర్యాంకు

- జిల్లా విద్యార్థిని ప్రతిభ


సంతోషిణి

బొబ్బిలి: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ఎంసెట్) తెలంగాణ రాష్ట్ర ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థిని వి.సంతోషిణి ఉత్తమ ర్యాంకు సాధించి సత్తా చాటింది. బొబ్బిలి డివిజన్‌లోని బాడంగి మండలం మల్లంపేటకు చెందిన సంతోషిణి 20వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి అప్పారావు భోగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. తల్లి భవాని గృహిణి.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 485.00
విజయనగరం	రూ. 489.00
శ్రీకాకుళం	రూ. 489.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,870-00
బంగారం(22సి. 10గ్రా.)	55,800-00
వెండి (కిలో)	76,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

పాడి రైతుకు భరోసా

- అమల్లోకి పశుబీమా
- లబ్ధిదారుల వాటా మూడేళ్లకు 20 శాతం చెల్లించాలి
- 21 రోజుల్లోపే పరిహారం అందజేతకు చర్యలు


ఇటువంటి పశువులకు బీమా వర్తింపు

రాజాం సిటీ: పాడినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా 'వైఎస్సార్ పశుబీమా పథకాన్ని' అమల్లోకి తెచ్చింది. వివిధ రకాల వ్యాధులు, ప్రమాదవశాత్తు పశువులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు వంటి పశు, జీవ సంపద మరణిస్తే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా బీమా పథకాన్ని రూపొందించింది. లబ్ధిదారుల వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. కాలయాపన లేకుండా పశు, జీవ సంపద మరణించిన 21 రోజుల్లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ అయ్యేలా నిబంధనలు తీసుకువచ్చింది. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల పరిహారం జమకాకపోతే ఆ విషయాన్ని సంబంధిత రైతులు తెలుసుకునేలా ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు ఉంచనున్నారు.

తెలుపు కార్డు దారులు అర్హులు

తెలుపు రేషన్ కార్డు కలిగిన నిరుపేద రైతులు ఈ పథకానికి అర్హులు. లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం, ఇతరులు (రైస్ కార్డు లేనివారు) 50 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలి. నిరుపేద రైతులు మూడేళ్ల కాలానికి తమ వాటా కింద ఒక్కో దానికి రూ. 384 ప్రీమియం కట్టాలి. అదే దేశీయ పశుజాతికి అయితే వాటా కింద రూ.480లు చెల్లించాల్సి ఉంటుంది. ఇతర రైతులైతే సంకరజాతి పశువులకు రూ.960 చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకలు, పందులకు అయితే ఒక్కోదానికి పేద వర్గాలకు చెందిన వారు వాటా కింద ఏడాదికి రూ.36లు, రెండేళ్లకు రూ.54లు, మూడేళ్లకు రూ.75 చెల్లించాలి. ఒకవేళ మరింత అధిక ధరకు బీమా చేయించుకోవాలనుకునే రైతులు పశువు విలువ ఆధారంగా పేద వర్గాలు 7.68 శాతం, ఇతర వర్గాలు 9.6 శాతం ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. పాడి రైతులంతా పశువైద్యాధికారులను సంప్రదించి పథకాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

బీమా వర్తింపు ఇలా..

వరదలు, తుపానులు, విద్యుత్ ప్రమాదాలు, పాముకాటు, అడవి జంతువుల దాడి, మంటల్లో చిక్కుకుని, రహదారి ప్రమాదాల కారణంగా మృతి చెందిన పశువులకు పథకంలో అర్హతగా పేర్కొన్నారు. అలాగే జబ్బులు, రోగాలతో మరణించిన వాటికి కూడా ఈ పథకం వర్తించనుంది. యజమాని నిర్లక్ష్యం కారణంగా పశువులు మరణిస్తే పథకం వర్తించదు.

రైతులకు తెలియజేస్తున్నాం..



నూతనంగా అమలు చేయనున్న బీమా పథకంపై పాడి రైతులకు తెలియజేస్తున్నాం. దీనిపై పూర్తిగా అవగాహన పెంపొందించేందుకు గ్రామాల్లో పాడి రైతుల వద్దకు వెళ్లి నేరుగా పథకం ప్రయోజనాన్ని వివరించేందుకు చర్యలు చేపట్టాం. ఈ పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.
బొత్స జయప్రకాశ్, పశుసంవర్థక శాఖ ఎ.డి, రాజాం

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ పథకం ద్వారా ప్రీమియం చెల్లించిన పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. రైతులు నష్టపోకుండా 21 రోజుల్లోనే సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీ ఆయా రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమచేయనుంది. ఇప్పటికే ఈ పథకంపై ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. అన్ని పశువైద్య కేంద్రాల్లో నమోదుకు సంబంధించిన వైద్యాధికారులకు సూచనలు చేశాం.
డాక్టర్ వైవీ రమణ, జేడీ, పశుసంవర్థకశాఖ, విజయనగరం

టెండరు ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! విజయనగరం జిల్లాలో 26 KGBV లకు మరియు 13 AP Model School బాలికల వసతి గృహములకు 2023-24 (10నెలలు) సంవత్సరమునకు ప్రొవిజన్స్ (సరుకులు) మరియు గుడ్లు సరఫరా చేయుటకు టెండరు ఆహ్వానించడమైనది.

టెండరు ఫారములు అదనపు పథక సమన్వయకర్త, సమగ్రశిక్షా, కలెక్టరేట్ కాంపౌండ్, విజయనగరం వారి కార్యాలయము నందు తే.26.05.2023 ది నుండి తే 01.06.2023ది వరకు కార్యాలయం పని దినములలో పనివేళల్లో పొందగలరు. ఇతర వివరములకు అదనపు పథక సమన్వయకర్త, సమగ్రశిక్ష వారి కార్యాలయంలో సంప్రదించగలరు.


- ➤ టెండరు ధరఖాస్తు ధర : రూ.10,000/-
- ➤ పూరించిన టెండరు ఫారము దాఖలు చివరి తేది: తేది.02.06.2023 సాయంత్రం గం.04:00ల వరకు.
- ➤ టెండరు తెరచు తేది: తేది.03.06.2023 సాయంత్రం గం.05:00 ల వరకు.
- ➤ టెండరు తెరుచు వేదిక : జాయింట్ కలెక్టరు, విజయనగరం వారి ఛాంబర్.

సం/- అదనపు పథక సమన్వయకర్త,
సమగ్రశిక్షా, విజయనగరం

నాడు-నేడు


నాడు నిర్వాసితుల కాలనీ

భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్వాసితులకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో నిర్మించిన నిర్వాసితుల కాలనీ సర్వాంగ సుందరంగా వారికి అందుబాటులోకి వచ్చింది. నాడు-నేడు నిర్వాసితుల కాలనీ చిత్రాలు ఇలా ఉన్నాయి.
సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


నేడు గృహాలతో కళకళలాడుతున్న కాలనీ